వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
TGTEL/25/A2649
VOICE OF PRAJALU
తెలుగు దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
సోమవారం, ఫిబ్రవరి 16, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## రష్యా చమురు కొనుగోలు నిలిపేస్తామని భారత్ హామీ
### అమెరికా విదేశాంగ మంత్రి రూబియో



మ్యూనిచ్, ఫిబ్రవరి 15: రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపివేయడానికి భారత్ కట్టుబడి ఉందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. జర్మనీలోని మ్యూనిచ్‌లో జరిగిన రక్షణ సమావేశంలో రూబియో మాట్లాడుతూ 'భారత్‌తో మేము జరిపిన చర్చల్లో రష్యా నుంచి చమురును కొనుగోలు చేయమన్న హామీ వారి నుంచి లభించింది' అని ప్రకటించారు. ఇటీవల భారత్‌తో జరిగిన వాణిజ్య ఒప్పందం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇదే విషయం ప్రకటించారు. రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ నిలిపివేస్తుందని ఇప్పటికే పలుసార్లు అమెరికా ప్రకటించింది.



## సేవా ధోరణే
# మా పాలనకు ప్రాణం: సీఎం రేవంత్

- 'నేనే రాజు.. నేనే మంత్రి' వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన సీఎం
- మున్సిపల్ ఎన్నికల ఫలితాలకు తానే బాధ్యత వహిస్తానని స్పష్టం
- లంబాడా సమాజం అండతో సీఎం హోదా సాధ్యమైందని వ్యాఖ్య
- వెనుకబడిన వర్గాల భాగస్వామ్యమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి
- పేదల సంక్షేమం, విద్య, తండాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- సేవాలాల్ జయంతి వేడుకల్లో సేవా భావాన్ని ఉద్ఘాటించిన సీఎం

హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని రాష్ట్ర ప్రజలకు తాము పాలకులు కాదని, సేవకులమేనని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయడానికే అధికారాన్ని ఇచ్చారని, తాను ఎప్పుడూ అధికార ధోరణితో వ్యవహరించలేదన్నారు. ఇటీవల తాను చేసిన 'నేనే రాజు.. నేనే మంత్రి' వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారని, వాస్తవానికి మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపోటములకు తానే పూర్తి బాధ్యత వహిస్తానని చెప్పే సందర్భంలో ఆ మాటలు చెప్పానని వివరించారు. ఎన్నికల ఫలితాలు తన పనితీరుకు ప్రమాణంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ శాంతి, సామరస్యాలకు ప్రతీకగా నిలిచిన మహనీయుడని

(మిగతా 2వ పేజీలో)

# అధికార కాంగ్రెస్ అక్రమాలకు పాల్పడతుంది: కేటీఆర్

- పోలీసుల సహకారంతో ప్రతిపక్షంపై దౌర్జన్యాలు జరిగాయని వ్యాఖ్య
- దొడ్డిదారిలో గెలుపు సాధించాలనే కుట్రలున్నాయన్న విమర్శ
- సింగరేణి రక్షణకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం
- గిరిజనుల సంక్షేమంలో కేసీఆర్ పాలనకే కీర్తి అంటూ వ్యాఖ్యలు
- సేవాలాల్ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ ధోరణిని వెల్లడించిన కేటీఆర్



హైదరాబాద్ : మున్సిపల్ పోలింగ్ సందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు పాల్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. పోలీసుల మద్దతుతో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలకు దిగినట్లు విమర్శించారు. ప్రజాస్వామ్య విధానాలను పక్కనబెట్టి దొడ్డిదారిలో గెలుపు సాధించేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగాల్సిన సమయంలో అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాన్ని అణగదొక్కడమే లక్ష్యంగా రాజకీయంగా ఒత్తిళ్లు తీసుకువస్తున్నారని ఆరోపించారు. అయినప్పటికీ ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ బలంగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సింగరేణి రక్షణ విషయంలో ఎవరూ ముందుకు రాకపోయినా తమ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తోందని కేటీఆర్ స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు, ప్రాంతీయ ప్రయోజనాల పరిరక్షణలో బీఆర్ఎస్ ఎప్పుడూ రాజీపడదని తెలిపారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమానికి గతంలో జరిగిన కృషిని గుర్తుచేసిన కేటీఆర్, కేసీఆర్ పదేళ్ల పాలనలోనే గిరిబిడ్డలకు న్యాయం జరిగిందన్నారు. 'మా తండాల్లో మా రాజ్యం' అనే

(మిగతా 2వ పేజీలో)



## బంజారాల హామీల్లో కాంగ్రెస్ విఫలం: కవిత

- బంజారా, ఆదివాసీ హక్కులపై ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న కవిత
- జిఒ 33 ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్
- సేవాలాల్ జయంతి వేడుకల్లో ఘాటైన వ్యాఖ్యలు
- గోర్ భోళి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి



## బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి

## రాహుల్ చెప్పేవన్నీ అసత్యాలు

- హోం మంత్రి అమిత్ షా విమర్శ
- బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్



# ట్రైబల్ వర్సిటీతో ఉన్నత విద్యావకాశాలు

- మోదీ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలు
- సేవాలాల్ స్ఫూర్తి భాజపా సిద్ధాంతాలకు సమీపమని పేర్కొన్నారు
- తండాల అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని విమర్శ
- సేవాలాల్ జయంతి వేడుకల్లో భాజపా నేతల నివాళులు
- ప్రకృతి పరిరక్షణకు సేవాలాల్ జీవితం అంకితం అని కొనియాడిన నేత

హైదరాబాద్: దేశవ్యాప్తంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు తెలిపారు. ములుగు ప్రాంతంలో సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ స్థాపనతో గిరిజన ప్రాంతాల్లో ఉన్నత విద్యకు కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని ఆయన పేర్కొన్నారు. విద్య, అభివృద్ధి రంగాల్లో గిరిజన యువతకు మరింత ప్రోత్సాహం లభించేలా కేంద్రం



(మిగతా 2వ పేజీలో)



# టీ20 వరల్డ్‌కప్‌లో పాక్‌పై భారత్ ఘన విజయం

- 61 పరుగులతో పాకిస్తాన్‌పై టీమిండియా ఆధిపత్య గెలుపు
- ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌పై ముద్ర
- సమష్టి బౌలింగ్‌తో పాక్‌ను 114కే కట్టడి
- వరుసగా మూడో విజయంతో 'సూపర్8'కు భారత్ అర్హత

# శివ నామస్మరణతో హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు

### తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు




హైదరాబాద్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు 'ఓం నమః శివాయ' నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఆదివారం (ఫిబ్రవరి 15) తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, వేములవాడ,

(మిగతా 2వ పేజీలో)

# సేవా ధోరణే మా పాలనకు ప్రాణం: సీఎం రేవంత్



సీఎం కొనియాడారు. దేశవ్యాప్తంగా కోట్లాది లంబాడా ప్రజలకు ఆయన మార్గదర్శిగా నిలిచారని పేర్కొన్నారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, సమాజంలో వెనుకబడిన వర్గాలను పాలనలో భాగస్వాములను చేయడమే తన లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా శాతాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి అధిక ప్రాధాన్యం కల్పిస్తూ కీలక పదవులు ఇచ్చామని వెల్లడించారు. గత పాలనలో దళితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శిస్తూ, ఇప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి వర్గానికీ గౌరవం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యం గొప్పతనం అందరికీ సమాన అవకాశాలు ఇవ్వడంలోనే ఉందని, డాక్టర్ అంబేద్కర్ చూపిన మార్గంలోనే ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తన రాజకీయ ప్రయాణంలో లంబాడా సమాజం ఎల్లప్పుడూ అండగా నిలిచిందని, సీఎం పదవి సాధించడంలో వారి మద్దతు ముఖ్యమైందని గుర్తుచేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోట్లాది పేదలకు రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని, ఉచిత విద్యుత్ పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు ఉపశమనం కల్పిస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, చదువు ద్వారానే వెనుకబడిన వర్గాలు ఎదుగుతాయని అన్నారు. గిరిజన విద్యార్థులు లక్ష్యంతో కష్టపడి చదువుకోవాలని సూచిస్తూ, వారికి అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. అలాగే రాష్ట్రంలోని అన్ని తండాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రతి తండాకు బీటీ రోడ్లు, ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ పంచాయతీ భవనాలు, మంచినీటి ట్యాంకులు, సోలార్ పంప్‌సెట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నల్లమల ప్రాంతంలో సంత్ సేవాలాల్ మహారాజ్ కోసం భూమిని కేటాయించినట్లు చెప్పిన సీఎం, వచ్చే జయంతి వేడుకలను అక్కడ నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తామని పేర్కొన్నారు. పేదలు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణకు కేంద్రబిందువుగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# టీ20 వరల్డ్‌కప్‌లో పాక్‌పై భారత్ ఘన విజయం

**61 పరుగులతో పాకిస్తాన్‌పై టీమిండియా ఆధిపత్య గెలుపు**

**ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌పై ముద్ర**

**సమష్టి బౌలింగ్‌తో పాక్‌ను 114కే కట్టడి**

**వరుసగా మూడో విజయంతో 'సూపర్8'కు భారత్ అర్హత**



ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత్ మరోసారి పాకిస్తాన్‌పై తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఇరు జట్ల మధ్య మ్యాచ్ అనగానే ఎప్పటిలాగే భారీ ఉత్కంఠ నెలకొన్నప్పటికీ ఫలితం మాత్రం మళ్లీ భారత్ వైపే మొగ్గుచూపింది. కీలక మ్యాచ్‌లో సమగ్ర ప్రదర్శన కనబర్చిన టీమిండియా 61 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసి ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ప్రపంచకప్ వేదికపై పాక్‌పై తమ రికార్డును మరింత బలపరుచుకుంది. కొలంబోలో జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్తాన్ ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలో అభిశేక్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగినా, ఇషాన్ కిషన్ దూకుడుతో ఇన్నింగ్స్‌కు దిశ నిర్దేశం లభించింది. పిచ్ బ్యాటింగ్‌కు అంతగా అనుకూలంగా లేక బంతి నెమ్మదిగా వస్తున్నా అతను దాన్ని పట్టించుకోకుండా ఆకర్షణీయ షాట్లతో పరుగులు రాబట్టాడు. పవర్‌ప్లేలోనే భారత్ వేగంగా స్కోరు పెంచగా, ఇషాన్ వరుస బౌండరీలు, సిక్సర్లతో పాక్ బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. అబ్రార్, షాహిన్ అఫ్రిది బౌలింగ్‌లోనూ అతను దూకుడును కొనసాగిస్తూ కేవలం 27 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. చివరకు 40 బంతుల్లో 77 పరుగులు చేసి మ్యాచ్‌లో కీలక తేడాను సృష్టించాడు. మరోవైపు సూర్యకుమార్ యాదవ్ 32 పరుగులతో సహకరించగా, తిలక్ వర్మ 25 పరుగులతో నిలకడగా ఆడాడు. చివర్లో శివమ్ దూబే (27 నాటౌట్), రింకూ సింగ్ ఉపయోగకర పరుగులు జోడించడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 175 పరుగులు చేసింది. పాక్ బౌలర్లలో సయీమ్ అయూబ్ మూడు వికెట్లు తీశాడు. లక్ష్య ఛేదనలో పాకిస్తాన్ ఆరంభం నుంచే ఒత్తిడిలో పడింది. తొలి ఓవర్లలోనే ఫర్హాన్, అయూబ్, సల్మాన్, బాబర్ ఆజమ్ వికెట్లు కోల్పోయి భారీ దెబ్బతిన్నది. పవర్‌ప్లే ముగిసే సరికి జట్టు 38/4కు పరిమితమవడంతో మ్యాచ్ భారత్ వైపు మళ్లింది. భారత బౌలర్లు కట్టుదిట్టమైన లైన్, లెంగ్త్‌తో పాక్ బ్యాటర్లకు అవకాశమే ఇవ్వలేదు. ఉస్మాన్ ఖాన్ ఒక్కడే ప్రతిఘటన చూపిస్తూ 44 పరుగులు చేసినా మిగతా బ్యాటర్లు వరుసగా విఫలమయ్యారు. అక్షర్ పటేల్ కీలక వికెట్లు తీసి మధ్యవరుసను కుదేలు చేయగా, బుమ్రా, పాండ్యా, వరుణ్, కుల్దీప్ సమష్టిగా రాణించారు. చివరికి పాకిస్తాన్ 18 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ విజయంతో భారత్ వరుసగా మూడో గెలుపు నమోదు చేసి 'సూపర్8' దశకు అర్హత సాధించింది. ఇక తమ చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో తలపడనుంది. మరోవైపు ఈ భారీ ఓటమితో పాకిస్తాన్ 'సూపర్8' అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. నమీబియాతో జరిగే మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత్‌పాక్ మ్యాచ్‌పై ఉన్న అంచనాల మధ్య మరోసారి ఏకపక్ష ఫలితమే రావడం గమనార్హం.

# బంజారాల హామీల్లో కాంగ్రెస్ విఫలం: కవిత

**బంజారా, ఆదివాసీ హక్కులపై ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న కవిత**

**జిఒ 33 ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్**

**సేవాలాల్ జయంతి వేడుకల్లో ఘాటైన వ్యాఖ్యలు**

**గోర్ భోళి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి**

**తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సూచన**

**బంజారాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలని ఆకాంక్ష**



బంజారాలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేసిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. బంజారాలు, ఆదివాసీల అంశాల్లో ప్రస్తుత ప్రభుత్వం అనవసర వివాదాలు సృష్టిస్తున్నదని ఆమె ఆరోపించారు. జిఒ 33 ప్రకారం బంజారాలకు రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోగ్ బండార్ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సేవాలాల్ సందేశాలను ఆదర్శంగా తీసుకుని జాగృతి ముందుకు సాగుతోందని తెలిపారు. సేవాలాల్ మహారాజ్ కేవలం ఆధ్యాత్మిక గురువే కాకుండా గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. బంజారా సమాజ అభ్యున్నతి కోసం సేవాలాల్ చేసిన కృషి దేశవ్యాప్తంగా పాఠ్యాంశాల్లో ఉండాలని కవిత కోరారు. గోర్ భోళి భాషను తప్పనిసరిగా రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. తండాల్లో ఇప్పటికీ పేదరికం పూర్తిగా తగ్గలేదని, గతంలో ఎదురైన సామాజిక సమస్యలు తగ్గినా ఆర్థిక వెనుకబాటు కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేక కార్యాచరణతో ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బంజారా శాఖలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ, తెలంగాణ జాగృతి మాత్రం ప్రధాన నిర్మాణంలోనే బంజారా బిడ్డకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం కల్పించిందని తెలిపారు. వెనుకబడిన వర్గాలను ముందుకు తీసుకురావాలన్న సంకల్పంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. సేవాలాల్ స్వాభిమానం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహానుభావుడని, ఆయన స్ఫూర్తితో బంజారాలు అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో కూడా బంజారా వర్గానికి తగిన ప్రాతినిధ్యం రావాలని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 'మన తండాల్లో మన రాజ్యం' అనే లక్ష్యంతో ముందుకు సాగామని తెలిపారు. యువత తండాల అభివృద్ధికి నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో యువకులు ముందుకు రావాలని, గ్రామాల్లోనే ఉండి ప్రజా నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తండాలను గ్రామపంచాయితీలుగా మార్చినా అవసరమైన మౌలిక వసతులు ఇంకా సరైన స్థాయిలో లేవని అన్నారు. ఈ పరిస్థితి మారాలంటే ప్రతి తండాకు రూ.25 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. రాష్ట్రంలో తమ పార్టీ గెలిచిన మున్సిపల్ సీటును కూడా కాంగ్రెస్ లాక్కుందని మండిపడ్డారు. ప్రతిపక్షం ఉండకూడదా అనే పరిస్థితి నెలకొల్పుతున్నారని విమర్శించారు. ఇటువంటి రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. సేవాలాల్ జయంతి, మహాశివరాత్రి సందర్భంగా ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

# మేయర్ పీఠం ఎవరిది? కరీంనగర్‌లో రసవత్తరంగా మారిన రాజకీయం

**కరీంనగర్ కార్పొరేషన్‌లో రసవత్తరంగా మారిన మేయర్ ఎన్నిక**

**కాంగ్రెస్ పార్టీలో చేరిన ఐదుగురు స్వతంత్ర, ఇతర పార్టీల కార్పొరేటర్లు**

**కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన ఎంఐఎం, మరో స్వతంత్ర కార్పొరేటర్**

**అతిపెద్ద పార్టీగా బీజేపీ.. మేయర్ పీఠానికి అవసరమైన బలానికి దూరం**

**మంత్రుల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కొత్త కార్పొరేటర్లు**




కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పలువురు స్వతంత్ర, ఇతర పార్టీల కార్పొరేటర్లు కాంగ్రెస్‌కు మద్దతు పలకడంతో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు సాయిజ్యోతి, శ్యామలతో పాటు, స్వతంత్రులుగా గెలిచిన కొమరయ్య, నందిని ఉదయ్, మల్లేశం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొత్తంగా ఐదుగురు కార్పొరేటర్లు హస్తం గూటికి చేరారు. హైదరాబాద్‌లో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఇదే సమయంలో, ఎంఐఎంకు చెందిన ముగ్గురు కార్పొరేటర్లతో పాటు, మరో స్వతంత్ర అభ్యర్థి మాజీద్ హుస్సేన్ కూడా కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. "కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తాము బలంగా నమ్ముతున్నామని, అభివృద్ధిని ఆకాంక్షించే కాంగ్రెస్‌లో చేరామని" పార్టీలో చేరిన కార్పొరేటర్లు తెలిపారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లకు ఎన్నికలు జరిగాయి. ఫలితాల ప్రకారం బీజేపీ 30 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9 సీట్లు సాధించాయి. మిగిలిన సీట్లు ఇండిపెండెంట్లు, ఎఐఎఫ్‌బీ వంటి చిన్న పార్టీలు గెలుచుకున్నాయి. మొత్తం కార్పొరేషన్ బలం 69 (66 ఎన్నికైన సభ్యులు + 3 ఎక్స్‌అఫీషియో సభ్యులు). మేయర్ పదవికి అవసరమైన మెజారిటీ మార్క్ 35. తాజా పరిణామాలతో కాంగ్రెస్ బలం పెరిగింది. అతిపెద్ద పార్టీగా ఉన్నప్పటికీ బీజేపీకి మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలం లేదు. దీంతో మేయర్ పీఠం కోసం పోరు హోరాహోరీగా మారింది. మిగిలిన స్వతంత్రులు, ఇతర పార్టీల మద్దతుతో ఎవరు అధికారాన్ని చేజిక్కించుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## అధికార కాంగ్రెస్ అక్రమాలకు పాల్పడతుంది: కేటీఆర్

నినాదాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కోయ, గిరిజన, లంబాడీ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్పు చేసి స్థానిక స్వయంపాలనకు బాటలు వేసినట్లు వివరించారు. అలాగే వేలాది గిరిజన యువతకు సర్పంచులు, వార్డు సభ్యులుగా అవకాశాలు కల్పించామని, పోడు భూములకు పట్టాలు అందజేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించామని చెప్పారు. సుమారు లక్షల ఎకరాల భూములకు హక్కులు ఇవ్వడం ద్వారా గిరిజన కుటుంబాలకు భద్రత కల్పించినట్లు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రానికి మరింత అభివృద్ధి కావాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. గిరిజనులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ చేపట్టిన కార్యక్రమాలను ప్రజలు గుర్తుంచుకుంటారని, ప్రజల ఆశీస్సులతో తిరిగి ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

## రాహుల్ చెప్పేవన్నీ అసత్యాలు

**హోం మంత్రి అమిత్ షా విమర్శ**

**బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్**

గాంధీనగర్: అమెరికా, యూకే, ఈయూతో వాణిజ్య ఒప్పందాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం తీవ్రంగా ఖండించారు. రాహుల్ రైతులను తప్పుదోవ పట్టించడంతో పాటు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఆయనకు చేతనైతే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. చర్చా వేదికను ఆయనే నిర్ణయించుకోవచ్చన్నారు. మన రైతులు, డెయిరీ ఉత్ప త్తులకు కేంద్రం పూర్తి రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. "వాణిజ్య ఒప్పందాలు మన రైతులకు హాని చేస్తాయన్న కాంగ్రెస్ ఆరోపణలు హాస్యాస్పదం. ప్రజలను తప్పుదోవపట్టించడంలో ఆ పార్టీ నేతలు సిద్ధహస్తులు. నిజానికి యూపీఏ హయాంలో కుదుర్చుకున్న పలు ఒప్పందాలు మన వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. వాటిలోని ప్రమాదకరమైన అంశాలను మోదీ ప్రభుత్వం రాగానే తొలగించింది" అని అమిత్ షా చెప్పారు.

## ట్రైబల్ వర్సిటీతో ఉన్నత విద్యావకాశాలు

పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జీవితం, ఆలోచనలు భాజపా సిద్ధాంతాలకు ఎంతో సమీపంగా ఉన్నాయని అన్నారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు సేవాలాల్ జీవితాంతం కృషి చేశారని రామచందర్‌రావు కొనియాడారు. బంజారా సమాజానికి ఆయన ఆరాధ్యదైవంగా నిలిచారని, ఆయన స్ఫూర్తితోనే గిరిజనుల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం విద్య, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అదే సమయంలో రాష్ట్రంలో గత భారాస, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తండాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. గిరిజన ప్రాంతాల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని ఆరోపించారు. తండాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సంస్థాగత కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్ నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాలను అనుసరించి గిరిజన సమాజ అభ్యున్నతికి కృషి కొనసాగించాలని నేతలు పిలుపునిచ్చారు.

## శివ నామస్మరణతో హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు

కాళేశ్వరం, కోటిపల్లి సహా అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర నదుల్లో స్నానాలు ఆచరించిన భక్తులు, శివనామ స్మరణ చేస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. అలాగే, కాళేశ్వరంలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, కీసర, వరంగల్‌లోని చారిత్రక శివాలయాలు భక్తజన సంద్రంగా మారాయి. 'హర హర మహాదేవ', 'శంభో శంకర' అంటూ భక్తులు చేస్తున్న జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణాలు దద్దరిల్లుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి. రాత్రివేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు, జాగరణ కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ (టీజీఎస్ఆర్టీసీ) పలు శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలను కల్పించారు. శివపార్వతులు ఏకమైన ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉండి, రాత్రంతా జాగరణ చేస్తే సకల పాపాలు తొలగి పుణ్యఫలం దక్కుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

## బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ: భారత్, బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి వస్తుందని ఆశిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. గతేడాది జూలై 24న ఇరు దేశాలు సమగ్ర ఆర్థిక వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ)పై సంతకం చేశాయి. 2030 నాటికి 56 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా ఈ ఒప్పందం జరిగింది. ఇది అమల్లోకి వస్తే చాక్లెట్లు, బిస్కెట్లు, సౌందర్య సాధనాలు వంటి వస్తువులపై సుంకాలు తగ్గనున్నాయి. అంతేకాదు స్కాచ్ విస్కీపై 150 శాతం ఉన్న సుంకం 75 శాతానికి తగ్గనుంది. 2035 నాటికి 40 శాతానికి తగ్గిస్తారు. ప్రస్తుతం 110శాతం ఉన్న సుంకాలను రానున్న ఐదేళ్లలో 10శాతానికి తగ్గించనున్నారు. ఇవన్నీ దశలవారీగా అమలు కానున్నాయి. ఇక భారత్‌కు చెందిన వస్త్రాలు, పాదరక్షలు, రత్నాలునగలు, క్రీడా సామగ్రి, బొమ్మలు వంటి ఉత్పత్తులను యూకేకు ఎగుమతి చేయడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులను కూడా పన్నుల సుంకాలు లేకుండా ఎగుమతి చేసే లభించనుంది. ఈ ఒప్పందంతో దేశంలోని చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు. అయితే ఈ ఒప్పందం అమలు కావడానికి ముందు యూకే పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉంది. ఇటీవల యూకే పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్ ఈ ఒప్పందంపై చర్చించింది. ఈ సందర్భంగా వాణిజ్య శాఖ మంత్రి క్రిస్ బ్రయంట్ మాట్లాడారు. ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య చారిత్రాత్మక విజయమన్నారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయడానికి ముందు రెండు సభల్లో చర్చలు, సమీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు.

# పల్లపు సురేందర్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే): నల్లగండ్ల డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా ముగిశాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు టీపీసీసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, తెలంగాణ ఎంబీసీ ఛైర్మన్ జెరిపేటి జైపాల్ లు ముఖ్య అతిథులుగా హాజరై, రాజు నాయక్, హనుమంతు, ఏఐఓబిసిఎస్‌ఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివ ముదిరాజ్, ఎస్‌పి నాయక్, లచ్చి రామ్ నాయక్, వెంకట్ లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లపు సురేందర్ మాట్లాడుతూ... ఎస్టి వర్గానికి చెందిన సేవాలాల్ మహారాజ్ గిరిజన సమాజ అభివృద్ధికి చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. వారి ఆలోచనలు, సమాజ సేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో సేవాలాల్ మహారాజ్ గుడిని ఏర్పాటుకు తాను కట్టుబడి ఉన్నానని, త్వరలోనే ఆ దిశగా చర్యలు ప్రారంభిస్తానని పల్లపు సురేందర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా గోపనపల్లి, కేశవ్ నగర్ మరియు నల్లగండ్ల డివిజన్‌కు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.







## శివరాత్రి మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 15(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ బౌరంపేట్ లో మహా శివరాత్రి పండగ సందర్భంగా పలు ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు గ్రామంలోని పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజాంపేట్ సర్కిల్ నిజాంపేట్ లోని శ్రీ నల్లపోచమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లి కౌసల్య కాలనీలో శ్రీ వెంకట శివ రామాలయ ఆలయంలో నిర్వహించిన మహాశివరాత్రి వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఫిలీం సెన్సార్ బోర్డు మెంబర్ సుక్క గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భక్తులకు పండ్ల పంపిణీ

నాచారం (వాయిస్ టుడే ):మహాశివరాత్రి సందర్భంగా తార్నాక డివిజన్ లో పలు ఆలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శివాలయాలు శివనామ స్మరణలతో మారుమోగాయి. శివుడికి రుద్రాభిషేకాలు తోపాటు ప్రత్యేక పూజలు చేశారు. బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఫిలీం సెన్సార్ బోర్డు మెంబర్ సుక్క గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కుందలాని మంది భక్తులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివయ్య ఆశీస్సులతో లాలపేట్ డివిజన్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి పండుగ పర్వదినాన్ని పురస్కరించొని తాను వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మేకల సారంగపాణి, సుక్క గణేష్ ముదిరాజ్, బీజేపీ నాయకులు, వెంకటేష్ గౌడ్, కృష్ణమూర్తి, కరుణాకర్, రాము వర్మ, భాను, శ్రీకాంత్, దేవుడు కుమార్, గౌతమ్, వనమాల శ్రీను తదితరులు పాల్గొన్నారు. కాగా శివరాత్రి సందర్భంగా ఈ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.

## చందానగర్‌లో ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

### సంత్ సేవాలాల్ మహారాజ్‌కు నివాళులర్పించిన రఘునాథ్ రెడ్డి



శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే): చందానగర్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ ఫేజ్ – 2లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక సేవాలాల్ ఆలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చందానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం,అహింసావాది సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన బాట అందరికీ ఆదర్శనీయమని గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఆయన కృషి మరువలేనిది. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గిరిజన సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## మహా శివరాత్రి, సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న అట్టేపల్లి రామప్రభు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ సామాజిక నాయకుడు అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు భక్తిశ్రద్ధలతో అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. జనప్రియా, మియాపూర్ లోని శివాలయం, ధర్మపురి దేవాలయం మరియు ఎం.ఎ.నగర్ దేవాలయంలో జరిగిన అభిషేకాలలో పాల్గొని భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎం.ఎ.నగర్ లో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మరియు ఏపీఆర్ టీమ్ సభ్యులు హాజరై భక్తి భావంతో పాల్గొన్నారు. మహా శివరాత్రి సందర్భంగా శివుని ఆశీస్సులతో సమాజం శాంతి, సౌభ్రాతృత్వం మరియు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



## కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు శివాలయాలను దర్శించుకున్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 15(వాయిస్ టుడే): శివరాత్రి పర్వదిన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని పలు ఆలయ కమిటీల ఆహ్వానం మేరకు స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శివాలయాలను దర్శించుకుని ఆ పరమశివుడికి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ పరమశివుడి అనుగ్రహంతో ప్రజల అందరి జీవితంలో సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో చీకటిని పారదోలి అందరి జీవితాల్లో కాంతులను నింపాలని ఆకాంక్షించారు...

మరోసారి నియోజకవర్గ ప్రజలందరికీ శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి ఆ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిసరాలు భక్తుల శివనామ స్మరణతో మార్మోగుతూ శోభామయం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మహాశివరాత్రి సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పునారెడ్డి

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 15(వాయిస్ టుడే): లెనిన్ నగర్ లో గల శివాలయంలో కమిటీ వారి ఆహ్వానం మేరకు అభిషేక కార్యక్రమంలో పాల్గొన్న మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు పున్నారెడ్డి ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ అష్ట ఐశ్వర్యాలు ఆరోగ్యంతో వర్ధిల్లాలని పూజించడం జరిగినది ఈ కార్యక్రమంలో కొమిరి శ్యామ్ ,గోపి యాదవ్ , సిహెచ్ సైదులు,రాజారెడ్డి, ప్రవీణ్ చారి,మహేష్ ,ప్రసాద్ , అజయ్ రెడ్డి మరియు కమిటీ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో శ్రీ శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి భ్రమరాంబ కేతమ్మ ఆలయంలో మహాశివరాత్రి 40వ కల్యాణ మహోత్సవాలు

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 15(వాయిస్ టుడే) : ఆలయ కమిటీ చైర్మన్ జె కే శేఖర్ యాదవ్ ఆహ్వానం మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడగా, మహాశివరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా కొనసాగాయి.ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షులు గణేష్, రషీద్,సిద్దనోల సంజీవరెడ్డి రెడ్డి చంద్రయ్య,రవి మరియు ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



## శ్రీ సంత్ సేవాళాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న, తాజా మాజీ కార్పొరేటర్ జగన్

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 15(వాయిస్ టుడే) : శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో జరిగిన జయంతి ఉత్సవాల్లో మాజీ కార్పొరేటర్ జగన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ, "సేవాలాల్ మహారాజ్ జీవిత సందేశాలు సమాజానికి మార్గదర్శకంగా ఉంటాయని, ఆయన బోధనలు ఆదివాసీ, గిరిజన సమాజ అభ్యున్నతికి తోడ్పడటమే కాకుండా, సమానత్వానికి ప్రాధాన్యతనిచ్చాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నాయక్. నర్సింగ్ నాయక్. తారా సింగ్. సునీత భాయ్. వెంకటేష్. మనోజ్ సింగ్. బాబు నాయక్ సంఘం సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మారబోయిన అనిల్ కుమార్ యాదవ్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే): సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ బంజారా (లంబాడీ) సమాజానికి ఆరాధ్య దైవం, గొప్ప ఆధ్యాత్మిక నాయకుడు, సంస్కర్త మరియు మార్గదర్శకుడనీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని చందానగర్ లో ఆదివారం నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో అనిల్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్



మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ బంజారా (లంబాడీ) సమాజానికి ఆరాధ్య దైవం, గొప్ప ఆధ్యాత్మిక నాయకుడు, సంస్కర్త మరియు మార్గదర్శకుడు. శాంతి, సమానత్వం, స్వీయ నియంత్రణ మరియు పర్యావరణ పరిరక్షణను బోధించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, నిజాయితీగా జీవించాలని, అపకారాలు చేయకూడదని ఉపదేశించారు. నిరాడంబరమైన జీవనం, ఆవులను రక్షించడం, సత్య మార్గంలో నడవడం ఆయన బోధనలలో ప్రధానాంశాలు. దర్శించుకుంటారు. సేవాలాల్ మహారాజ్‌ను శివుని అవతారంగా (కొందరు మేరమ్మ భక్తునిగా) బంజారాలు కొలుస్తారు. ఆయన బోధనలు నేటికీ బంజారా సంస్కృతి, ఆచార సంప్రదాయాలకు మూలంగా నిలిచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సభవత్ శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యక్షులు వెంకట్ రావు నాయక్, జనరల్ సెక్రటరీ మునియా నాయక్, జాయింట్ సెక్రటరీ అమర్ సింగ్ నాయక్, కోశాధికారి హేమలత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాలుగోన్నారు.

# కేపీహెచ్బీ కాలనీలో ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు

## - టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్




కూకట్ పల్లి; ఫిబ్రవరి 15(వాయిస్ టుడే): కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని కేపీహెచ్బీ కాలనీలో సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలు కాలనీలోని రమ్య గ్రౌండ్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి. కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ బడుగు బలహీన వర్గాల కోసం చేసిన సేవలను విశేషంగా కొనియాడారు. సంచార జాతులుగా జీవించిన నాయక్ సమాజాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించిన మహనీయ పోరాటయోధుడిగా సేవాలాల్ మహారాజ్‌ను అభివర్ణించారు. ఆయన చూపిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయక్ సమాజానికి ఎక్కడైనా, ఎప్పుడైనా అవసరమైతే తాము అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరపున రావాల్సిన అన్ని ప్రయోజనాలు అందేలా తగిన సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. అలాగే సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటు కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమం అనంతరం రమ్య గ్రౌండ్ నుంచి ఫిఫ్త్ ఫేస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీని బండి రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఉత్సాహభరితంగా సాగిన ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులను రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాలి బాలాజీ, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సంజీవరావు, అరవింద్ రెడ్డి, పొడుగు అప్పారావు, శివ చౌదరి, సంధ్య తదితరులు పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు కేపీహెచ్బీ కాలనీలో ఐక్యత, ఉత్సాహం, సామాజిక చైతన్యానికి నిదర్శనంగా నిలిచాయి.



## 287 సంత్ సేవాలాల్ జయంతి సంబరాలు

జూబ్లీహిల్స్ 15 ఫిబ్రవరి (వాయిస్ టుడే): రహేమత్ నగర్ డివిజన్ ఎస్పిఆర్ హిల్స్ లో ఉన్న సేవలాల్ దేవాలయం లో ఘనంగా పూజలు నిర్వహించి భారీ ఎత్తున ర్యాలీ తీయడం జరిగింది.. సేవాలాల్ మహారాజ్ దేవాలయంలో ముఖ్య అతిథులు నాయకులు మరియు ప్రజలు భారీ ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించి వచ్చిన వాళ్ళకి అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు.. భారత దేశమంతటా గోర్ బంజారా సమాజ ప్రజలు సేవాలాల్ జయింతిని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలోనాగమల్లేష్నాయక్.. నాగశ్వర్ రావు.. డి రాము నాయక్..జయంద్ర నాయక్..లక్ష్మణ్ నాయక్..రాజు నాయక్.. రవీందర్.. అనంతయ్య.. నందు నాయక్.. రమేష్ నాయక్..ఇతరులు పాల్గున్నారు



## మహా శివరాత్రి వేడుకల్లో భక్తి పారవశ్యం -- మూసాపేట్‌లో ప్రత్యేక అభిషేకం

### – కూకట్‌పల్లి నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు

కూకట్ పల్లి; ఫిబ్రవరి 15(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్‌లో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మూసాపేట్‌లోని ప్రసిద్ధ శ్రీ శ్రీ శ్రీ సిద్ధి లింగేశ్వర స్వామి ఆలయంలో కూకట్‌పల్లి నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక తొలి అభిషేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద మంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం తూము వేణు నియోజకవర్గ ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, ఐశ్వర్య సమృద్ధులతో ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, మహా శివరాత్రి సందర్భంగా మూసాపేట్ డివిజన్ పరిధిలోని ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసి ఫోకస్ లైట్లు, విద్యుత్ దీపాలు తదితర అవసరమైన ఏర్పాట్లు చేయించినట్లు తెలిపారు. భక్తుల రాకపోకలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు, కార్యకర్తలు పాల్గొని వేడుకలను భక్తి భావంతో జరుపుకున్నారు. మహా శివరాత్రి సందర్భంగా మూసాపేట్ ప్రాంతం అంతా శివనామస్మరణతో మార్మోగింది.



## ఘనంగా కూకట్‌పల్లిలో మహాశివరాత్రి వేడుకలు

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

కూకట్‌పల్లి: ఫిబ్రవరి 15(వాయిస్ టుడే ): పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసా పేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ హరిహరక్షేత్ర దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు జనసేన పార్టీ నాయకులు హాజరై భక్తులతో కలిసి పాల్గొన్నారు. దేవస్థానం చైర్మన్ నాగిరెడ్డి ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారికి అభిషేకం చేసి, అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులతో కలసి శివనామస్మరణలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, మహాశివరాత్రి పర్వదినం ప్రజలకు ఆధ్యాత్మిక చైతన్యం, శాంతి, సౌభాగ్యం ప్రసాదించాలి అని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, శాంతి నెలకొని అందరూ సుఖశాంతులతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, పోలెబోయిన శ్రీనివాస్, బందిరెడ్డి గోపి తదితరులు పాల్గొన్నారు. అలాగే గుడి కమిటీ సభ్యులు బిక్షపతి గౌడ్, వెంకటపతి రాజు, సత్యనారాయణ, నాగేంద్ర కుమార్, మన్నెమ్మ, వర్రె నాగరాజు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా దేవాలయం వద్ద భక్తుల రద్దీ భారీగా కనిపించింది. ప్రత్యేక అలంకరణలు, దీపారాధనలు, భజనలతో ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.ం

## శ్రీ హంకాళి సహిత మహా కాళేశ్వర స్వామి దేవస్థానములో మహా శివరాత్రి ఉత్సవాలు

### భారీగా తరలి వచ్చిన భక్తులు..



నాచారం (వాయిస్ టుడే ):మహా శివరాత్రి సందర్భంగా నాచారం లోని శ్రీ హంకాళి సహిత మహా కాళేశ్వర స్వామి దేవస్థానములో శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు హోమాలు, రుద్రాభి శేకం, నిర్వహించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకూ భక్తులు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చారు. శివున్ని దర్శించుకుని ఉపవాస దీక్షలు విడిచారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ట్రాఫిక్ సమస్యలు కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## నేడు కురవి శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో 'మహా అన్నప్రసాద' వితరణ

హైదరాబాద్,ఫిబ్రవరి 15: కురవి భద్రకాళి సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహా శివరాత్రి పండుగ సందర్భంగా ఈనెల 16వ తేదీన సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటి సభ్యులు కాసుల మల్లిఖార్జున్, సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి కాసుల వినోద్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కురవిలో జరుగుతున్న బ్రహోత్సవ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో భక్తులు హాజరవుతారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 4వేల మందికి పైగా అన్న ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే జె. రాంచందర్ నాయక్, ఉత్సవ కమిటీ చైర్మన్ కూర రవీందర్ రెడ్డి, ఆలయ ఈఓ సత్యనారాయణ, మేకల దామోదర్ రెడ్డి లతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు, తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి ప్రతినిధులు నర్రా దేవేంరద్, నర్రా విజయ, రమణ, కొండూరు వినోద్ కుమార్, సంజన, శ్వేత, ప్రవంతి, స్వాతి, చంద్రుడు, సతీష్, భారతి, లక్ష్మీ, వందన, శకుంతల, అండాలు, శ్యామ్, సంధ్యారాణి, విజయ, సాయి కిషోర్, సాయి కిరణ్, మౌనిక, శివాని, కాసూల అనసూయ వెంకటేశం కుటుంబ సభ్యులు, తదితరులు ఈ అన్నప్రసాద వితరణలో సేవ అందించనున్నారని వారు తెలిపారు.



## హిందూ ధర్మ సంస్థాపనే 'ఛత్రపతి' ఆశయం

### శివసేన (యూబీటీ) గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గౌటే

హైదరాబాద్,ఫిబ్రవరి 15: హిందూ ధర్మ సంస్థాపనకు ఛత్రపతి శివాజీ నిరంతరం సంఘర్షించారని శివసేన (ఉద్దవ్ బాలా సాహెబ్ థాక్రే) పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గౌటే అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల వాల్ పోస్టర్ ను ఆదివారం నారాయణగూడ లోని శివసేన పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైదరాబాద్ నగర ఇంచార్జీ కేశవ్ గుప్తా, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పూస శ్రీనివాస్ తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 19వ తేదీన నారాయణగూడ లోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఛత్రపతి శివాజీ ధైర్య సాహసాలు యువతకు ఆదర్శమని, ఆయన ఆశయాల సాధన కోసం యువత పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద పరిధిలోని పలు ప్రాంతా నుంచి బైక్ ర్యాలీలు నిర్వహించి అఫ్జల్ గంజ్ లోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వరకు చేరుకుంటాయని ఆయన తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శివాజీ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శివసేన పార్టీ అధికార ప్రతినిధి రాపాక మహేష్, రాష్ట్ర కార్యదర్శి వికాస్ సింగ్ ఠాకూర్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు అర్రేపు వంశీధర్, ఉపాధ్యక్షుడు మల్కాన్ సుదర్శన్, యువసేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బోయ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## నాచారంలో ట్రస్ట్ కార్స్ ఓనర్ రోషన్ మతానికి అతీతంగా ఉపవాస భక్తులకు పండ్ల పంపిణీ

నాచారం (వాయిస్ టుడే ):మహా శివరాత్రి సందర్భంగా నాచారం లోని ట్రస్ట్ కార్స్ యాజమాని రోషన్ మతానికి అతీతంగా... ఉపవాస దీక్ష ఉన్న భక్తులకు పండ్ల పంపిణీ చేసి.వారికి శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులందరూ సుఖ సంతోషాలతో మంచిగా ఉండాలని ఆ శివయ్యను రోషన్ వేడుకుని భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్స్ సిబ్బంది, ఎంప్లాయిస్ పాల్గొన్నారు.



## మారుమోగిన శివనామస్మరణ

### శివాలయాలకు పోటెత్తిన భక్తజనం ప్రముఖుల ప్రత్యేక పూజలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15: శివరాత్రి పండుగ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నీ శివాలయాలు శివనామ స్మరణతో మారు మోగాయి. శివాలయాలకు భక్తజనం పోటెత్తారు. పలువురు ప్రముఖులు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆలయాల్లో ప్రజలు కర్జూరాలతో తమ ఉపవాస దీక్షలను విరమించారు.

**నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో..** నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ లోని శివాలయంలో బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. ఆర్. లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, మహాశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**బర్కత్ పుర లోని శివాలయాల్లో...** బర్కత్ పుర లోని శివాలయాల్లో సీనియర్ కాంగ్రెస్ నేత, జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**రాజేంద్రనగర్‌లో..** రాజేంద్రనగర్ లోని శివాలయాల్లో బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు పండ్లు పంపిణీ చేశారు.

# బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా చిట్టిపోలు ప్రీతం కుమార్ నియామకం

### బీసీలకు రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలలో పార్టీలకు అతీతంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 15: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ యువత హక్కుల సాధనకు మరో కీలక అడుగు పడిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య అన్నారు. జాతీయ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా చిట్టిపొల్లు జి. ప్రీతం కుమార్ ను నియమిస్తూ ఆర్. కృష్ణయ్య ఆదేశాలు జారీ చేశారు. ఈ నియామకాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా చిట్టిపోలు జి. ప్రీతం కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచిగారి ప్రవీణ్ కుమార్, బీసీ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు అభిలాష్ గౌడ్ సహా తనకు అండగా నిలిచిన బీసీ మిత్రులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ మాట్లాడుతూ..



బీసీ సమాజం ఎన్నో ఏళ్లుగా రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా తీవ్ర అన్యాయానికి గురవుతుందని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు, పార్టీలకు అతీతంగా రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ పోరాటంలో బీసీ యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంఘటితంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. బీసీల హక్కుల సాధన, రాజకీయ భాగస్వామ్యం, సామాజిక న్యాయం లక్ష్యంగా జాతీయ బీసీ యువజన సంఘం చేపట్టే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు.

# తెలంగాణలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మిద్దెల జితేందర్





హైదరాబాద్: వాయిస్ టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ భక్తిశ్రద్ధలతో శివాలయంలో శివలింగాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజరాజేశ్వరి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల శాంతి, సుభిక్షం కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాశివరాత్రి ధర్మం, న్యాయం, సత్యం కోసం పోరాడే ఆత్మవిశ్వాసాన్ని ప్రజల్లో పెంపొందించే పండుగ అని పేర్కొన్నారు. అదే ఆత్మవిశ్వాసంతో తెలంగాణ ప్రజలు ఇటీవల జరిగిన మున్సిపల్ మరియు గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఘన విజయాన్ని అందించారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పరిపాలన, పారదర్శకత, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు విశేష మద్దతు తెలుపుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించారని ఆయన అన్నారు. ఈ విజయాలు ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువత ఉపాధి, సామాజిక న్యాయం, పేదల పక్షపాత పాలన వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ప్రజలు మద్దతుగా తీర్పు ఇచ్చారని తెలిపారు. అలాగే మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ మరింత బలోపేతం అవుతోందని, ప్రతి కార్యకర్త ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

"ప్రజా ధర్మాన్ని కాపాడే శక్తి కాంగ్రెస్ పార్టీ. ఇటీవల జరిగిన ఎన్నికల విజయాలు ప్రజల ఆశీర్వాదానికి ప్రతీక" అని మిద్దెల జితేందర్ పేర్కొన్నారు. సేవాదళ్ కార్యకర్తలు ప్రజల మధ్యే ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను చివరి వ్యక్తి వరకు చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, సేవాదళ్ ప్రధాన కార్యదర్శి బండి సురేందర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రమాకాంత్, మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు గద్దబూటి హరికృష్ణ, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ - కార్పొరేషన్ ఎన్నికల్లో

# బీసీలకు 42% ప్రాధాన్యం ఇవ్వాలి

## బీసీ నేతల డిమాండ్

హైదరాబాద్ (వాయిస్ టుడే): మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలు 53 శాతం గెలుపొందిన నేపథ్యంలో చైర్మన్, మేయర్ పదవుల్లో కనీసం 42 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. బీసీ జేఏసీ కన్వినర్, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, బీసీ సాధికారిత సంఘం ఉత్తర తెలంగాణ ఇంచార్జీ పొలాస నరేందర్ సంయుక్తంగా ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. కోర్టు అడ్డంకులు మరియు కేంద్రంలో బీసీ బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో చట్టబద్ధంగా మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు 31.4 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ, బీసీల రాజకీయ చైతన్యంతో జనరల్ స్థానాల్లో కూడా గెలుపొందుతూ మొత్తం 53 శాతం విజయాలను సాధించడం బీసీ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.



**మున్సిపల్ ఽ కార్పొరేషన్ ఫలితాలు -- ముఖ్యాంశాలు**

116 మున్సిపాలిటీలలో చట్టబద్ధంగా 38 చైర్మన్ స్థానాలు బీసీలకు కేటాయింపు

7 కార్పొరేషన్లలో సుమారు 30 శాతం మేర 3 మేయర్ స్థానాలు బీసీలకు కేటాయింపు

రిజర్వ్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో గెలిచి మొత్తం 53% విజయాలు

**సీఎం హామీ అమలు చేయాలి**

సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు పార్టీ పరంగా బీసీలకు 42 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని ప్రకటించిన నేపథ్యంలో, ఈ నెల 16న జరిగే మున్సిపల్ చైర్మన్, మేయర్ ఎన్నికల్లో ఆ హామీ అమలు చేయాలని నేతలు డిమాండ్ చేశారు.

**పంచాయతీ ఎన్నికల గణాంకాలు**

బీసీ నేతలు తెలిపిన వివరాల ప్రకారం.. చట్టబద్ధంగా 42% ఇవ్వాల్సిన చోట 17% రిజర్వేషన్లే అమలు

2,275 సర్పంచ్ స్థానాలు రిజర్వ్‌గా కేటాయింపు

రాజకీయ చైతన్యంతో జనరల్ స్థానాల్లో మరో 2,738 గెలుపులు

మొత్తం 12,733 సర్పంచ్ స్థానాల్లో 5,013 స్థానాలు (39.5%) బీసీల ఖాతాలోకి

**వేములవాడలో బీసీల సత్తా**

వేములవాడ మున్సిపాలిటీలో బీసీలకు 9 స్థానాలు మాత్రమే కేటాయించినప్పటికీ, రాజకీయ చైతన్యంతో 18 స్థానాలు గెలుచుకోవడం పట్ల బీసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల పదవి పంపకాల్లో బీసీలకు న్యాయం జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని, బీసీ సామాజిక వర్గం ఇచ్చిన గెలుపు తీర్పుకు తగిన గౌరవం ఇవ్వాలని వారు కోరారు.

# భువనగిరి మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం ఉత్కంఠ..

# సీల్డ్ కవర్‌లో ఎవరి పేరు?











యాదాద్రి భువనగిరి జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి) : యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి మున్సిపాలిటీలో కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అనంతరం నేడు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది. చైర్మన్ పదవికి ఐదుగురు మహిళా అభ్యర్థులు పోటీ పడుతుండగా, చివరకు ఎవరికి అవకాశం దక్కుతుందో అన్న ఆసక్తి పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోంది. భువనగిరి మున్సిపాలిటీలో మొత్తం 35 వార్డులకు ఎన్నికలు జరిగి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి 22 సీట్లు లభించగా, ఐదు మంది స్వతంత్ర కౌన్సిలర్లు మద్దతు ప్రకటించడంతో కాంగ్రెస్ బలం 27కి చేరింది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ఏకగ్రీవంగా ఎన్నుకునే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

**చైర్మన్ రేసులో ఐదుగురు మహిళలు**

**చైర్మన్ పదవికి పోటీ పడుతున్న అభ్యర్థుల్లో:**

29వ వార్డు నుంచి పోతంశెట్టి మంజుల వెంకటేష్
35వ వార్డు నుంచి తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్
11వ వార్డు నుంచి గంజి శ్రీవాణి గణేష్ రెడ్డి
7వ వార్డు నుంచి కుక్కదూగు పద్మ సోమయ్య
23వ వార్డు నుంచి బర్రె పూజిత జహంగీర్





ప్రతి అభ్యర్థి కూడా తమ రాజకీయ అనుభవం, కుటుంబ సేవల ఆధారంగా అవకాశం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిను కోరినట్లు సమాచారం. అభ్యర్థుల భర్తలు దీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన నేపథ్యం ఉన్నట్లు తెలుస్తోంది.

**అధిష్టానం నిర్ణయం కీలకం**

స్థానికంగా ఎవరి పేరు సిఫారసు అవుతుందో, అలాగే అధిష్ఠానం ఎవరిని ఆమోదిస్తుందో అన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. చివరి నిర్ణయం మహేష్ కుమార్ గౌడ్ పంపే సీల్డ్ కవర్ ద్వారా వెలువడే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**వైస్ చైర్మన్ పదవికి పోటీ**

వైస్ చైర్మన్ పదవికి మైనార్టీ వర్గానికి అవకాశం కల్పిస్తే 30వ వార్డు అభ్యర్థి ఎండీ లయక్ అహ్మద్ పేరును పరిశీలించే అవకాశం ఉంది. ఇక ఎస్సీ వర్గానికి అవకాశం ఇస్తే ఎస్సీ అభ్యర్థుల్లో ఒకరికి పదవి దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే 14వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి తర్వాత కాంగ్రెస్‌లో చేరిన తుమ్మేటి పాండు కూడా వైస్ చైర్మన్ పదవి కోసం ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది.

**నేడు కీలక కార్యక్రమం**

నేడు నిర్వహించనున్న ప్రమాణ స్వీకారం మరియు ఎన్నికల కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరుకానున్నారు. భువనగిరి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉండటంతో చైర్మన్ ఎంపికపై చివరి నిర్ణయం అధిష్టానం చేతుల్లో ఉంది. ఐదుగురు మహిళా అభ్యర్థుల మధ్య ఉత్కంఠ కొనసాగుతుండగా, సీల్డ్ కవర్ తెరచిన తర్వాతే అసలు చిత్రం స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్‌కి భువనగిరి మున్సిపల్ చైర్మెన్ పదవి ఇవ్వాలి

### – యాదాద్రి భువనగిరి జిల్లా సనాతన హిందు దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు దేవరకొండ నరసింహ చారి



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో..(వాయిస్ టుడే ప్రతినిధి):– భువనగిరి పట్టణంలో అనూహ్య విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ కి ఇంతటి చరిత్ర తెచ్చిన గౌ ఎం ఎల్ శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రేపు జరుగబోయే పురపాలక సంఘం చైర్మెన్ ఎన్నిక లో తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ గారికి చైర్ పర్సన్ గా అవకాశం కల్పించాలీ అని శివరాత్రి సందర్భంగా కోరుకుంటు పరిపాలన సవ్యంగా జరగాలీ అంటే ఖబ్జాల చరిత్ర లేని వ్యక్తిగా ప్రజలతో మమేకమయ్యే శక్తిగా కుంభం అనిల్ అన్న బాటలో నిజాయితీని నిలబెట్టే నాయకురాలు గా తంగళ్లపల్లి శ్రీ వాణి గారికి ఇవ్వాలి అని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20 లక్షల మంది విశ్వకర్మల తరపున భువనగిరి పట్టణంలో అన్ని అర్హతలు కలిగిన విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సోదరిగా బి సి మహిళగా ముఖ్యంగా అనిల్ అన్న లైన్ ఫాలోవర్ గా పట్టణ ప్రజలకు సుపరిపాలన అందించాలని తపన తో వ్యక్తికే చైర్ పర్సన్ ప్రకటించి భువనగిరి పట్టణ ప్రజల అభిమానాన్ని చూరగొన్న అనిల్ అన్న కు తోడుగా బలమైన శక్తి తంగళ్లపల్లి శ్రీవాణి పేరును ప్రకటించాలని

మాజీ కౌన్సిలర్, మాజీ చైర్మెన్ పచ్చల కట్ట సోమేశ్వర ఆలయం మాజీ అధ్యక్షుడు, భువనగిరి గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు,యాదాద్రి భువనగిరి జిల్లా సనాతన హిందు దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు దేవరకొండ నరసింహ చారి పేర్కొన్నారు.



## ఈనెల 18 నుండి యాదాద్రిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వాయిస్ టుడే/ యాదగిరి గుట్ట బీ యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట దేవస్థానం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపద్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు ఆలయ ఈఓ భవాని శంకర్ మాట్లాడుతూ ఈ నెల 24 నుండి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తున్నారు అని తెలిపారు దేవస్థాన బ్రహ్మోత్సవాల వివరాల పత్రికను ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచార నిమిత్తం పత్రిక ఆవిష్కరణ చేసారు హైదరాబాద్ నుండి స్వామి వారి రథం అఖండ జ్యోతి ప్రాంభించామని తెలిపారు బ్రహ్మోత్సవాలలో భక్తులు అందరూ పాల్గొని స్వామి వారి కృపా కటాక్షాలకి పాత్రులు కాగలరు అని సూచించారు ఇందులో ఈఓ భవాని శంకర్ ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు ఆలయ చెర్మెన్ నర్సింహ మూర్తి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



## సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బీర్ల అయిలయ్య దంపతులు

యాదగిరిగుట్ట (వాయిస్ టుడే) : జైన మందిరం వద్ద టాంగా ( గుర్రాపు బండి) నడిపిన సందడి చేసిన బీర్ల అయిలయ్య. ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తన సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనితతో కలిసి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భగవంతుడైన శివయ్యను ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే దంపతులను శాలువాతో సన్మానించి ఆశీస్సులు అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది.

**జైన మందిరం వద్ద టాంగా ( గుర్రాపు బండి) నడిపి సందడి చేసిన బీర్ల అయిలయ్య దంపతులు**



ఆలేరు నియోజకవర్గంలో ప్రజలతో మమేకమవుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జైన మందిరం సమీపంలో టంగా నడుపుతూ సందడి చేశారు. స్థానికులతో కలిసి స్నేహపూర్వకంగా ముచ్చటిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ ఆయన ఆప్యాయంగా గడిపారు.టంగా ఎక్కి స్వయంగా నడిపిన ఆయనను చూసి ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. నాయకుడు తమ మధ్య సాధారణ వ్యక్తిలా కలిసిమెలిసి ఉండడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. స్థానికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకుతూ తమ అభినందనలు తెలిపారు.

# ఘనంగా వేములవాడలో మహా శివరాత్రి వేడుకలు

## ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాల సమర్పణ



వేములవాడ; ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మహా శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం లో వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించ బడ్డాయి రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి గా రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామి వారికి సతీసమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. మహా శివరాత్రి సందర్భంగా భీమేశ్వరాలయం లో స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, దక్షిణ కాశీ గా పేరు గాంచిన వేములవాడ రాజన్న ఆలయానికి విశిష్ట ప్రాధాన్యత ఉందన్నారు. గతంలో ఆలయ అభివృద్ధి కోసం పోరాటం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో ఆలయ అభివృద్ధి పనులు వేగ వంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. సుమారు రూ.150 కోట్ల వ్యయంతో 4 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. లక్షలాది మంది భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ఆధునిక సదుపాయాలు కల్పిస్తూ దేవస్థానాన్ని మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రం లో సమృద్ధి గా వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేములవాడ రాజన్న ఆలయం మాత్రమే కాకుండా సమ్మక్క–సారలమ్మ ఆలయాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే పారదర్శక ప్రజాపాలన, సంక్షేమ పథకాల అమలు ఎలాంటి అవరోధాలు లేకుండా కొనసాగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



## బర్త్‌డే వేడుకలు హాజరైన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం (వాయిస్ టుడే) : ఖమ్మం నగరానికి చెందిన బీఆర్ఎస్ ప్రముఖ నాయకుడు తోట రామారావు కుటుంబంలో ఆనంద వాతావరణం నెలకొంది. తోట రామారావు, కార్పొరేటర్ గోవిందమ్మ మనవడు పార్థ్ ఆద్యంత్ తొలి పుట్టినరోజు వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగరంలోని నాయుడుపేట ప్రాంతంలో టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాలులో జరిగిన ఈ వేడుకలకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన సన్నిహితులతో కలిసి హాజరయ్యారు. చిన్నారి పార్థ్ ఆద్యంత్‌కు అక్షింతలు వేసి ఆశీర్వదించిన ఆయన, తల్లిదండ్రులు తోట రమేష్ కుమార్ -- లక్ష్మీభార్గవిలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, బచ్చు విజయ్ కుమార్, కిరణ్, సీనియర్ జర్నలిస్టులు ఆకుతోట ఆదినారాయణ, లింగయ్య, శ్రీనివాస్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తోట రమేష్ సన్నిహితులు పాల్వంచ రాజేష్, గౌరిశెట్టి వినోద్, నానబాల హరీష్ తదితరులు చిన్నారికి ఆశీస్సులు అందజేశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలు ఆనందోత్సాహాలతో సాగగా, రామారావు -- గోవిందమ్మలకు పలువురు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



## శంభో శివ శంభో

**– 'హరహర మహాదేవ' నినాదాలతో మార్మోగిన మండలం**

**– భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా మహాశివరాత్రి నిర్వహణ**

పెద్దవంగర, ఫిబ్రవరి 15(వాయిస్ టుడే): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దవంగర మండలంలోని శైవక్షేత్రాలు ఆదివారం భక్తుల కోలాహలంతో సందడి నెలకొంది. ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. "హరహర మహాదేవ శంభో శంకర... పాహిమాం... పాహిమాం..." అంటూ భక్తులు భోళా శంకరుడిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ పులకించిపోయారు. శివరాత్రి సందర్భంగా స్వామివారి దర్శనం కోసం భక్తులు వేకువజామున నుంచే ఆలయాలకు చేరుకున్నారు. పాలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి జాగరణ, భజనలు, శివతాండవ స్తోత్ర పఠనాలతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. మండలంలోని చిన్న వంగర గ్రామ శివాలయంలో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ వార్డు మెంబర్ శివరాత్రి శోభ--సోమనర్సు దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. తాగునీరు, ప్రసాద వితరణ, క్రమబద్ధమైన క్యూ లైన్ల నిర్వహణ వంటి చర్యలు చేపట్టారు. విద్యుత్ దీప కాంతులతో అలంకరించిన ఆలయాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

## సోమవారం ప్రజావాణి కార్యక్రమం రద్దు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మహా శివరాత్రి జాతర, మున్సిపల్ ఎన్నికల్లో భాగం గా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యం లో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో సోమవారం (ఫిబ్రవరి 16వ తేదీ) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. అధికారులు అందరూ వేములవాడ మహా శివరాత్రి జాతర, ఎన్నికల విధుల్లో ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.



## శ్రీ భీమేశ్వరస్వామిని దర్శించుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్

వేములవాడ, ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే): మహా శివరాత్రి జాతర సందర్భంగా శ్రీ భీమేశ్వర స్వామి వారి ని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ దర్శించుకున్నారు. ఈ సందర్భం గా స్వామి వారికి పూజలు చేశారు. ఆలయం ఆవరణం వద్ద వైద్య శిబిరం, మే ఐ హెల్ప్ యూ డెస్క్ లను పరిశీలించారు. వైద్య శిబిరం లో ఏ ఏ మందులు అందుబాటు లో ఉన్నాయో పరిశీలించారు. హెల్ప్ డెస్క్ లో సిబ్బంది తో మాట్లాడారు. అనంతరం క్యూ లైన్ల వద్ద భక్తులతో మాట్లాడి.. ఇక్కడ అందిస్తున్న సేవల పై ఆరా తీశారు. వాలంటీర్లు నీటిని పంపిణీ చేస్తుండగా పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది, హెల్ప్ డెస్క్ బాధ్యులకు పలు సూచనలు చేశారు.బీమేశ్వర సదన్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే కలిసి పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా ఎన్నికల అధికారి, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాట్లను పరిశీలించిన; ఇంచార్జి కలెక్టర్**

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే) : రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) నిబంధనల మేరకు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం చేస్తున్న ఏర్పాట్ల ను పరిశీలించారు. ముందుగా సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో కౌన్సిల్ సమావేశ మందిరం లో చేసిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం.. అనంతరం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఇక్కడ సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, అధికారులు శ్రీనివాసాచారి, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సజావుగా జరిగేందుకు సహకరించండి

**ముగ్గురు కంటే ఎక్కువ మంది గుమిగూడటంపై నిషేధం**

**– పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్**



జమ్మికుంట ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం రోజు జరగనున్న మున్సిపల్ చైర్మన్, వైస్ ఛైర్మన్ పరోక్ష ఎన్నిక సందర్భంగా కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు 163 బి ఎన్ ఎస్ ఎస్ (గతంలో సెక్షన్ 144) ఉత్తర్వులను అమలు చేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ముగ్గురు కంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటం నిషేధం అని, అమలు సమయం ఫిబ్రవరి 16 ఉదయం 06:00 గంటల నుండి ఫిబ్రవరి 17 ఉదయం 06:00 గంటల వరకు ఉంటుందన్నారు. ఏదైనా చట్టబద్ధమైన సమావేశాలు నిర్వహించాలన్నా సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని, విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, సైనిక సిబ్బంది మరియు హోంగార్డులు, అంత్యక్రియల ఊరేగింపులు, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, వైద్య, అత్యవసర సేవలు సమర్థ అధికారి నుండి ప్రత్యేక అనుమతి పొందిన వ్యక్తులు,బృందాల కు ఈ ఉత్తర్వుల నుండి కింది వారికి మినహాయింపు ఉంటుంది అని అన్నారు. మున్సిపల్ పరోక్ష ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ కోరారు.

## హుజురాబాద్‌లో బైక్ దొంగల బీభత్సం

**పగలూ రాత్రి తేడా లేకుండా వరుస చోరీలు – సీసీటీవీకి చిక్కిన దృశ్యాలు**

**పలుచోట్ల పనిచేయని నిఘా నేత్రాలు**

**– ఆందోళనలో ప్రజలు.. గస్తీ పెంచాలని వేడుకోలు**



హుజురాబాద్ ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే) : హుజురాబాద్ పట్టణంలో ద్విచక్ర వాహనాల దొంగలు హల్చల్ చేస్తున్నారు. గడిచిన వారం రోజులుగా ముఖ్యంగా స్ప్లెండర్ మోటార్ సైకిళ్లను లక్ష్యంగా చేసుకుని ఇంటి ముందర పార్కింగ్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్తున్నారు. పట్టపగలు, రాత్రి వేళల్లో ఈ చోరీలు జరుగుతుండటం ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. విద్యానగర్ ప్రాంతంలో జరిగిన ఓ చోరీ ఘటన సీసీటీవీ కెమెరాలో నమోదైంది. అయితే పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు పనిచేయకపోవడం దొంగలకు అదనపు అవకాశంగా మారిందని స్థానికులు అంటున్నారు. ఈ లోపాన్ని ఉపయోగించుకుంటూ బైకులను ఎత్తుకెళ్తున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పట్టణంలో పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయని సమాచారం. దీంతో వాహన యజమానుల్లో ఆందోళన నెలకొంది. వాహనాలను బయట ఉంచాలంటే భయపడుతున్నామని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పట్టణంలో సీసీటీవీ కెమెరాల పనితీరును పునరుద్ధరించి పహారా పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## గ్రామీణ ప్రాంత క్రీడలను ప్రోత్సహించాలి

తొర్రూరు, ఫిబ్రవరి 15 వాయిస్ టుడే : గ్రామీణ ప్రాంత క్రీడాలను ప్రోత్సహించాలని పిహెచ్ఎస్ పిడి ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం మేరా యువ భారత్ వరంగల్ కేంద్రం వారి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో తొర్రూరు మండలాల బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ కి 15 నుంచి 29 సంవత్సరాల యువతి, యువకుల కోసం నిర్వహించిన క్రీడలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడలకు విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు.క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులకు మేధాశక్తి,శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మేరా యువ భారత్ వాలంటీర్ భానోత్ వీరన్న, ఉపాధ్యాయ పీడీలు మరియు విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌గా బీసీలను నియమించాలి



తొర్రూరు, ఫిబ్రవరి 15 వాయిస్ టుడే : తొర్రూరు మున్సిపల్ చైర్మన్ గా బీసీ వర్గానికి చెందిన అభ్యర్థిని నియమించాలని మేధావుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ కూరపాటి రమేష్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో బీసీ మేధావుల ఫోరం మరియు బిసి,ఎస్సీ,ఎస్టీ, జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్ పదవి బీసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు.అన్ని రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం మరియు సమాన హక్కుల పరిరక్షణ దృష్ట్యా బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించాలని కోరారు.

సోమవారం జరగబోయే చైర్మన్ ఎన్నికల్లో బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో బీసీ వర్గాల గౌరవాన్ని కాపాడే విధంగా అన్ని పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ రిటైర్డ్ ప్రొఫెసర్ చందా మల్లయ్య, బీసీ మేధావుల ఫోరం వరంగల్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ డా. కె. వీరస్వామి,బీసీ మేధావుల వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మండల పరశు రాములు,నేషనల్ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మెరుగు బాబు యాదవ్, బీసీ నాయకులు కొత్తూరు రమేష్,అన్నపురం వెంకన్న గౌడ్,బూరిశెట్టి అల్లబాబు,కోదునూరు సదాకర్, కుమారస్వామి,సాదు రాములు, దొంక ఐలయ్య, పుప్పాల మధు, కుమార్ పాల్గొన్నారు.

# గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవా లాల్

**అడుగుజాడల్లో పయనించాలి**

**సేవాలాల్ 287వ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు**

**మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు**



మిర్యాలగూడ ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే ): గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు కొనియాడారు. ఆ మహనీయుడి అడుగుజాడల్లో పయనించాలని పిలుపునిచ్చారు

యావత్ భారతదేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త సేవాలాల్ మహారాజ్ అంటూ అభివర్ణించారు. సంత్ సేవాలాల్ 287వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గంలోని బంజారాలకు/లంబాడాలకు భాస్కర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో రెడ్డి కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సంత్ సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికారంగా నిర్వహించిందని గుర్తు చేశారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేసిందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించి గిరిజనులకు రాజ్యాధికారంలో కీలక భాగస్వామ్యం చేసిన ఘనత కేసీఆర్ దేనని భాస్కర్ రావు తెలిపారు. హైదరాబాద్‌లో బంజారాహిల్స్‌గా పిలుచుకుంటున్న ప్రాంతంలో మూడు శతాబ్దాల క్రితమే సేవాలాల్ మహారాజ్ నడయాడారని, అదే బంజారాహిల్స్ నేలమీద వారి పేరుతో నిర్మించిన భవన్‌లో బీఆర్ఎస్ సర్కార్ అధికారికంగా నిర్వహించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవిస్తే అణగారిన వర్గాల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి తగిన గుర్తింపు దక్కుతుందనడానికి వారి జయంతి ఉత్సవాల నిర్వహణ మరో ఉదాహరణగా నిలిచిందని పేర్కొన్నారు. అడవి బిడ్డల ప్రత్యేకమైన ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం, సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడటానికి సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి గొప్పదని వెల్లడించారు. తన ప్రజలను బయటి సమాజం నుంచి అనుక్షణం రక్షించుకొనే దిశగా సంత్ సేవాలాల్ జీవితాంతం పోరాటం సాగించారని పేర్కొన్నారు. ఆ దిశగా వారు కల్పించిన చైతన్యం, వారు చేపట్టిన కార్యాచరణ దేశవ్యాప్తంగా ఉన్న లంబాడా/బంజారాలకు రక్షణ కవచంగా నిలిచిందని వివరించారు. బంజారాలకు స్ఫూర్తి ప్రదాతగా నాటి కాలంలో వారు చేసిన కృషి, విశ్వవ్యాప్తంగా ఉన్న బంజారాలకు వారిని ఆధ్యాత్మిక గురువుగా, తమ ఆరాధ్య దైవంలా కొలిచేలా చేసిందని గుర్తుచేశారు. గిరిజన బిడ్డల ఆత్మగౌరవం పరిఢవిల్లేలా వారి ప్రతిభను చాటేందుకు, ఉద్యోగ, ఉపాధి, విద్య, క్రీడలు తదితర రంగాల్లో బీఆర్ఎస్ సర్కారు అనేక కార్యక్రమాలను నిర్వహించిందని చెప్పారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున, అత్యంత ఖరీదైన ప్రాంతంలో సంత్ సేవాలాల్ మహారాజ్ పేరుతోనే బంజారా భవన్‌ను వారి ఆత్మగౌరవం ఉట్టిపడేలా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. ఇందులో సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన చేసిందన్నారు. గిరిజనులంతా ఐకమత్యంతో మెలిగి పార్టీలకు అతీతంగా కృషి, పట్టుదలతో పరస్పర సమన్వయంతో పనిచేసి మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని నల్లమోతు భాస్కర్ రావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీఎస్ ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహా రెడ్డి, ధనావత్ చిట్టిబాబు నాయక్, నల్లమోతు సిద్దార్థ, అంగోతు హాతీరాం నాయక్, చౌగాని బిక్షమ్ గౌడ్, సుధాకర్ నాయక్, కుర్ర శ్రీను నాయక్, మాలోతు రవీందర్ నాయక్, లలిత, శంకర్ నాయక్, సూర్య నాయక్, శ్రీను నాయక్, వీర నాయక్, చంటి, రవి నాయక్, దస్రు నాయక్, బంజారా సంఘాల నేతలు, నాయకులు, పాల్గొన్నారు




## జిల్లాలో ఘనంగా సీఎం కప్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా ఫిబ్రవరి-15 వాయిస్ టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీలు సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి ఆరెపల్లి రాజయ్య, పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ సుల్తానాబాద్ మండల ఎస్ జి ఎఫ్ కన్వీనర్ ప్రణయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, టేబుల్ టెన్నిస్ క్రీడల వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు.గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా ఈ పోటీలు యువతలో ఉత్సాహాన్ని నింపుతున్నాయని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్ ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ, ఇక్బాల్, అబ్దుల్ రజాక్,విద్యార్థులు పాల్గొన్నారు..



## పూసాలలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా ఫిబ్రవరి-15 వాయిస్ టుడే : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణ కేంద్రం పూసాల శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ వేగోళం శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు రుద్రాభిషేకాలు నిర్వహించి భక్తులతో శివనామ స్మరణలో భక్తుల సందడి మధ్య భక్తిశ్రద్ధలతో సాగిన పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణన్ని సృష్టించాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వేగోళం శంకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలు సుఖ శాంతి ఆయురారోగ్యాలు సమృద్ధి కోసం ప్రత్యేక పూజలు చేశామని ఆధ్యాత్మికత మన సంస్కృతికి పునాది అని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఆనందంగా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూసాల లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ పురం హరికిషన్ రావు, శంభు లింగేశ్వర స్వామి దేవాలయ డైరెక్టర్లు పిట్టల రమేష్, జూలూరి శ్రీనివాస్, పెగడ శ్యాంసుందర్, కనుకుంట్ల ప్రమీల, గడ్డం అంజి, గడ్డం శంకర్ గౌడ్, కనుకుంట్ల శ్రీనివాస్,వేగోళం అఖిల్ గౌడ్, బుర్ర సురేష్, ఉస్తేం వినయ్, జూలూరి సాయికిరణ్, వేగోళం వంశీ, పురోహితులు,వెంకటరమణ, భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోవలెంట్ పరిశ్రమ ఎదుట ఆందోళన

**- విష జలాలు విడుదల చేస్తున్నారంటూ భగ్గుమన్న గ్రామస్తులు**

**- నక్క వాగును కలుషితం చేస్తున్నాయంటూ నిరసన**




నర్సాపూర్ (వాయిస్ టుడే): హత్నూర మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ గ్రామ శివారులో ఉన్న కోవలెంట్ ల్యాబరేటరీస్ పరిశ్రమ ఎదుట గుండ్లమా చునూర్ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. పరిశ్రమ నుంచి విష జలాలను విడుదల చేస్తూ సమీపంలోని నక్క వాగును కాలుష్యానికి గురి చేస్తున్నారని ఆరోపిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోవలెంట్ పరిశ్రమ నుంచి నక్క వాగు వెంట కొనుగోలు చేసిన భూముల వరకు పైప్‌లైన్లు ఏర్పాటు చేసి, వాటి ద్వారా రసాయన మిశ్రమ జలాలను విడుదల చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ కాలుష్యం వల్ల భూగర్భ జలాలు దుషితమవుతున్నాయని, వ్యవసాయం పూర్తిగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతోనే ఆందోళనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. పీసీబీ అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదిలేది లేదంటూ గ్రామస్తులు పరిశ్రమ ఎదుట భీష్మించి కూర్చొన్నారు. విషయం తెలుసుకున్న పీసీబీ అధికారులు ఫోన్ ద్వారా గ్రామస్తులతో మాట్లాడి, సమస్యను వెంటనే పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.



## శివాలయం భక్తులు సందడి

రాయికల్ ( వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలోని శివాలయంలో మహా శివ రాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు గర్భగుడిలో కొలువున్న ఈశ్వరుణ్ణి భక్తులు గంటలకు పైగా క్యూలైన్ లో ఉండి దర్శనం చేసుకున్నారు అనంతరం ద్వాదశ జ్యోతిర్లింగా లకు ఐదు గంటల సమయం దాకా క్యూ లైన్ ఉండి అభిషేకం చేశారు. స్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది, అనంతరం సాయంకాలం స్వామివారి పల్లకి సేవ నిర్వహించారు. మహా అన్నదానంలో వేలాది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. దాదాపు ముప్పయి వెయ్యిలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృప పాత్రలు అయ్యారు. శివసేవకులు దగ్గరుండి చేసిన సేవలు అభినందనీయం అని పలువురు అన్నారు.

## నేడే ప్రమాణ స్వీకారం, చైర్మన్ ఎవరు?

రాయికల్ పట్టణ ప్రజలు ఏ రాజకీయ పార్టీలకు పూర్తి కౌన్సిలర్ స్థానాలను ఇవ్వక పోవడంతో, ఇతర పార్టీలతో భాగస్వామ్య సహకారం తప్పనిసరిగా మారింది,

కాగా రాజకీయ పార్టీల భీఫాం లతో గెలిచిన కౌన్సిలర్ లు వారి పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తే అట్టి పార్టీ విప్ జారీ చేయడంతో వారి కౌన్సిలర్ పదువులు పోయి రి ఎలక్షన్ లు వచ్చే అవకాశాలు కూడ ఉన్నాయి. చైర్మన్ ఎవరు అనేది ఇప్పుడే తెలేలా అనిపించడం లేదు, ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ కి ఐదు కౌన్సిలర్ స్థానాలు ఉండగా మరో ఇద్దరు కౌన్సిలర్ ల అవసరం ఉంది



కాంగ్రెస్ పార్టీ మూడు కౌన్సిలర్ స్థానాలు సాధించగా ఒకటి సంజయ్ వర్గం,మరో రెండు జీవన్ రెడ్డి వర్గం కాగా ఒకరు జీవన్ రెడ్డి వర్గం నుండి పోటీలో ఉన్న స్వతంత్ర కౌన్సిలర్ ఉన్నారు. ఇప్పటికే వీరి మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తుంది కానీ అధికారికంగా నిర్ధారణ కాలేదు గతంలో భారతీయ జనతా పార్టీలో పనిచేసిన ఓ కౌన్సిలర్ మరియు స్వతంత్ర అభ్యర్థి సహాయంతో భారతీయ జనతా పార్టీ కూడ చైర్మన్ స్థానాన్ని దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి, కౌన్సిలర్ లకు ప్రమాణ స్వీకారం తో పాటు చైర్మన్ ఎన్నిక కూడ నేడు ఉన్నట్లు అధికారులు ఇప్పటికే ప్రకటన విడుదల చేశారు. రెండు వర్గాల నుండి సరియైన అధికార ప్రకటన రాకపోవడంతో మళ్ళీ కౌన్సిలర్ చైర్మన్ ప్రమాణ స్వీకారం వాయిదా పడేలా ఉంది.



## శివోహం... శివోహం.... హర హర మహాదేవ శంభోశంకర ...

## శివనామస్మరణతో మారు మ్రోగిన శివాలయాలు ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

తొర్రూరు, ఫిబ్రవరి 15 వాయిస్ టుడే : తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పలు మండలాలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు మహాశివరాత్రి రోజున పురస్కరించుకొని ఆదివారం శివనామ స్మరణలతో మారుమోగాయి. తొర్రూర్ పట్టణంలోని ఓంకారేశ్వర నిలయ ప్రాంగణంలో నెలకొని ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగశుద్ధ చతుర్దశి పురస్కరించుకొని ఆదివారం శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయంలోని అర్చకులు రేణిగుంట్ల శివ, శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం నుండే పంచామృతాభిషేకాలు, మహాశివుని రుద్రాభిషేకం అష్టోత్తర శతనామావళి పూజా కార్యక్రమాలు, భక్తుల గోత్ర నామార్చనలు ,మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. ఈ శివాలయాల వద్ద భక్తుల శివోహం శంభో శంకర ,శివనామాలతో మారుమ్రోగింది. భక్తులు శివనామ స్మరణతో పారవశ్యం చెందారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా ఓంకారేశ్వర నిలయ ప్రాంగణంలో నెలకొన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ శాశ్వత కమిటీ ,నిర్వహణ కమిటీల ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు , విశ్వకర్మలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

హత్నూర మండల ప్రజలకు
శ్రేయోభిలాషులకు
అందరికీ మహా శివరాత్రి
శుభాకాంక్షలు
తెలియజేస్తున్న వారు
బ్రాహ్మణ గూడ సర్పంచ్
శోభ లింగం గౌడ్ గ్రామం
బ్రాహ్మణ గూడ మండల్
హత్నూర జిల్లా సంగారెడ్డి



## మహాశివరాత్రి పర్వదిన వేడుకలు



నర్సాపూర్ (వాయిస్ టుడే) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నాడు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపట్టారు భక్తులతో శివాలయం మారుమోగిపోయింది హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ శివాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు మహాశివరాత్రి పురస్కరించుకొని నేడు సోమవారం ఆయా ఆలయాలలో శివపార్వతుల కళ్యాణోత్సవం జరిపేందుకు ఆలయాలను ముస్తాబ్ చేశా ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు వేద పండితులు పాల్గొన్నారు.

## కల్లు గీత కు వన్నెతెచ్చిన నేత బొమ్మగాని ధర్మభిక్షం గౌడ్

**తెలంగాణ గీత పనివారల సంగం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్**

ఎల్బీనగర్ ఫిబ్రవరి 15 (వాయిస్ టుడే) బి: కల్లు గీత కార్మికుల సంక్షేమముకోసం తన జీవితాంతము ఎనలేనికృషి చేసి కల్లు గీత కు వన్నె తెచ్చిన మహనీయుడు మాజీ యంపీ సర్జీయ బొమ్మగాని ధర్మభిక్షం అని కల్లు గీత పనివారల సంగం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ గౌడ్ అన్నారు . తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ,సిపిఐ నాయకులు, మాజీ యంపీ సర్జీయ బొమ్మగాని ధర్మభిక్షం 104 వ జయంతి ని ఎల్ .బి .నగర్ గీత పనివారల రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. బొమ్మగాని ధర్మభిక్షం తెలంగాణ సాయుధ పోరాటంలో , సిపిఐ పార్టీకి అభ్యునతికి ,గౌడ సంఘానికి చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు వక్తలు కొనియాడారు . కల్లు గీత కార్మికుల కోసం పింఛన్ ఇవ్వాలని చేసిన పోరాటం అజరామణీయం అన్ని అన్నారు కల్లు గీత కార్మికుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాళ్ళ సమస్యలను తీర్చేవిధంగా ప్రభుత్వాలను ఒప్పించి నేటి తరానికి కూడా నాయ్యం జరిగే విధముగా పోరాడిన మహిణీయుడు బొమ్మగాని ధర్మభిక్షం అన్ని పలువురు ఈ సందర్భంగా కొనియాడారు .ఈ కార్యక్రమంలో బొమ్మగాని నాగభూషణం, కె .వి ఎల్ .రవి, బోయపాటి రాములు .,కిషోర్ ,బొమ్మగాని సాకేత్ ,సిద్దగాని జగదీష్ గౌడ్ పాల్గొన్నారు

